క్లుప్తంగా

సుస్థిర అభివృద్ధే ధ్యేయం



గుడ్లవల్లేరు: సుస్థిర అభివృద్ధే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు లక్ష్యాలను పెట్టుకోవాలని జెడ్పీ శిక్షణ మాజీ మేనేజర్ అబ్బదాసరి ధర్మరాజు అన్నారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో అధికార, ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులను మంగళవారం జెడ్పీ డెప్యూటీ సీఈఓ ఆనందకుమార్ నిర్వహించారు. గ్రామాల్లో అభివృద్ధికి ఉపయుక్తమయ్యే తొమ్మిది రకాల పథకాలను ధర్మరాజు వివరించారు. అనంతరం డెప్యూటీ సీఈఓను ఎంపీడీఓ టి.విజయసారథి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పామర్తి కన్య భాస్కరరావు, కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

మండవల్లిలో నగర సంకీర్తన



మండవల్లి: మండవల్లిలోని షిర్డీ సాయిబాబా మందిరంలో ధనుర్మాసం సందర్భంగా మంగళవారం నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలి



కొమరవోలు(పామర్రు): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండలంలోని కొమరవోలు గ్రామంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఏసు చూపిన మార్గంలో పయనించాలని కోరారు. అనంతరం క్రిస్మస్ కేకును కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, పాస్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



పామర్రు: మండలంలోని పలు గ్రామాల్లోని విష్ణాలయాల్లో ధనుర్మాస పూజలను రెండో రోజు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసం పురస్కరించుకుని గోదాదేవి రంగనాథ స్వామివార్లకు విశేషంగా పూజాధికాలను చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మండలంలోని జమీదగ్గుమిల్లిలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో గోదాదేవి పూజలను చేశారు.

సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

గుడివాడరూరల్: మినుము పంటలో రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి పేర్కొన్నారు. మండలంలోని మోటూరు, వలివర్తిపాడు గ్రామాల్లో ఏఓ బి.అనంతలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మంగళవారం ఏడీఏ మాట్లాడారు. మినుము సాగులో బంగారు తీగ సమస్య ఎక్కువగా ఉందన్నారు. వరి పనలు కట్టేత కట్టిన వెంటనే పెండమెతాలిన్ మందును ఎకరాకు 800 మి.లీ. చొప్పున నాలుగు మరకల ఇసుకలో చల్లుకోవాలని సూచించారు. అది చల్లిన 24 గంటల తర్వాత నీటిని స్ప్రే చేయాలని తెలిపారు.

అన్నసమారాధనకు భారీ ఏర్పాట్లు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ షష్ఠి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం నిర్వహించే అన్నసమారాధనకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ అన్న సమారాధనకు జిల్లాని పలు ప్రాంతాల నుంచి 60 వేలకు మంది పైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేసి ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల రద్దీ కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్నిరకాల ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి మంగళవారం తెలిపారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

పమిడిముక్కల: సేవా సంస్థల సహకారంతో మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఆకాంక్షించారు. మండలంలోని గోపువానిపాలెంలో మంగళవారం ఆయన పర్యటించారు. విజయవాడ కోల్ ఇండియా లిమిటెడ్, రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ గుంటూరు రామారావు సహకారంతో మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు.

ఆహార సలహా సంఘ

సమావేశం ఎప్పుడో?

కూటమి ప్రభుత్వ పుణ్యమా అంటూ అధికారులు సమావేశాలను నిర్వహించటమే మరచినట్లు ఉన్నారు. అందుకే నేమో ప్రజా సంఘాలు, అన్ని వర్గాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించాల్సిన ఆహార సలహా సంఘ సమావేశాలను నిర్వహించకుండా చేతులెత్తేస్తున్నారు. దీంతో దీర్ఘకాలికంగా ఉన్న ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవటం లేదు. రేషను సరుకులు, గ్యాస్, డీజిల్, పెట్రోల్ సరఫరాల్లో ఇబ్బందులను ఈ సమావేశాల్లో ప్రజల తరఫున ఆహార సలహా కమిటీ సభ్యులు చర్చించే అవకాశం లేకుండా పోయింది.

ప్రజా సమస్యలు పట్టించుకోని వైనం



గుడ్లవల్లేరు తహసీల్దార్ కార్యాలయం

గుడ్లవల్లేరు: రేషను కార్డుల లబ్ధిదారులు, గ్యాస్ వినియోగదారులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు సమస్యలు వచ్చినా పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్డీఓ అధ్యక్షతన ఆహార సలహా సంఘ సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ కమిటీలో అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రతినిధులను ప్రతి మండలం నుంచి నియమిస్తారు. అలాంటి కమిటీ ఏర్పాటు గాని, సమావేశాలు ఏవీ నిర్వహించటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సమావేశంపై అధికారులకు ఏ మాత్రం శ్రద్ధ లేదని తేటతెల్లమవుతోంది.

15వేలకు పైగా రేషను కార్డులు

గుడ్లవల్లేరు మండలంలో 41 రేషను దుకాణాలు ఉన్నాయి. మండలంలో రేషను కార్డులు 15వేలకు పైగా ఉన్నాయి. 10 ఎండీయూ వాహనాల ద్వారా రేషను సరుకులను పంపిణీ చేస్తున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రజల చెంతకే రేషను సరుకులు వెళ్లాలనే సదుద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ వాహనాలకు కూడా త్వరలో మంగళం పాడేందుకు కూటమి ప్రభుత్వం యత్నిస్తున్నట్లు సమాచారం. రేషను షాపులకు పౌర సరఫరాల శాఖ వారు సరఫరా చేస్తున్న సరుకులు సక్రమంగా అందుతున్నాయా? లేదా అనే జవాబుదారీ తనం లేకుండా పోయింది. అధికారులు అశ్రద్ధ వహించటంతో మండలంలోని నిత్యావసర సరుకుల సరఫరా ఇష్టానుసారంగా చేస్తున్నట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాబోయే కాలంలో ప్రభుత్వం కొత్తగా రేషను కార్డులను మంజూరు చేసేందుకు కూడా అడుగులు వేయబోతుంది. మండలంలోని రేషను దుకాణాలన్నీ కూడా అధికార పార్టీ కనుసన్నల్లో నడుస్తుండటంతో అధికారులు కూడా తనిఖీలు మానేశారనే విమర్శలు లేకపోలేదు. కొత్తగా రేషను షాపుల దరఖాస్తులకు ఆహ్వానం పలికినా...అధికార పార్టీ అండదండలు ఉన్న వారికే ఆ షాపులు దక్కుతాయనే విమర్శలు వస్తున్నాయి.

నీరు గారుతున్న ఆదేశాలు

పేదలకు ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులు మూడు నెలలకు ఒకసారి తనిఖీ చేయాలన్న ఆదేశాలు ఉన్నా అధికారులకు పట్టడం లేదు. సరుకుల సరఫరాపై ఫిర్యాదులు వస్తున్నా అధికారులు పట్టించుకోకపోవటంతో ప్రజల ఆగ్రహాన్ని చూరగొంటున్నారు. రేషను కార్డులపై అనేక సమస్యలు ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదనే ఆరోపణలు కార్డుదారుల నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఆహార సలహా సంఘ సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

గతంలో క్రమం తప్పకుండా సమావేశాలు



గతంలో ఆహార సలహా సంఘ సమావేశాలు క్రమం తప్పకుండా జరిగేవి. మూడునెలలకోసారి సమావేశాన్ని అధికారులు నిర్వహించేవారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించటం జరిగేది. ఇప్పుడు అలాంటి పరిస్థితులు కనబడటం లేదు.

– పి.దేవసహాయం, సీపీఎం గుడ్లవల్లేరు మండల నాయకుడు

సమావేశాలను పక్కన పెట్టేశారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఆహార సలహా సంఘ సమావేశాలను నిర్వహించకుండా పక్కన పెట్టేశారు. ప్రజలకు అవసరమైన విషయాలను చర్చించే ఇలాంటి సమావేశాలను నిర్వహించక పోవటం అన్యాయం. సలహా సంఘానికి అన్ని మండలాల నుంచి రాజకీయ పార్టీల ప్రతినిధులను నియమించాలి.

– కోటప్రోలు నాగు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

మండవల్లి: రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కె. గోపాల్ అన్నారు. మండలంలోని పులపర్రులో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు చెందిన భూ సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకే ఈ సదస్సులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సదస్సులో ఐదు అర్జీలు వివిధ సమస్యలపై అందజేశారు. ఆర్ఐ శ్రావణి, వీఆర్వో శ్యామలరావు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: భూ సమస్యల పరిష్కార వేదికగా రెవెన్యూ సదస్సులు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆటపాక పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడారు. రెవెన్యూ సదస్సులో తహసీల్దారు, వివిధ శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారన్నారు. ప్రధానంగా మీ భూమి–మీ హక్కు కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యలను తక్షణం పరిష్కరించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, సర్పంచ్ తలారి మణిమ్మ, ప్రత్యేకాధికారి, ఏలూరు జిల్లా ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ కేఎస్‌వీ నాగలింగాచార్యులు, ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ జేఎస్ సుభాని పేర్కొన్నారు. మండలంలోని ఊటుకూరులో రెవెన్యూ గ్రామసభ మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సులో రైతుల నుంచి 29 అర్జీలు అధికారులకు అందాయి.

పామర్రులో..

పామర్రు: రెవెన్యూ సదస్సులని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తోట్లవల్లూరు తహసీల్దార్ కుసుకుకుమారి అన్నారు. తోట్లవల్లూరు మండలం తోట్లవల్లూరు గ్రామ సచివాలయంలో మంగళవారం సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పాల్గొన్నారు.

– పామర్రు మండలం పెదమద్దాలి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహించినట్లు తహసీల్దార్ రవికాంత్ తెలిపారు.

అర్జీల స్వీకరణ

గుడ్లవల్లేరు: చిత్రం రెవెన్యూ సదస్సులో అర్జీలను అధికారులు స్వీకరించారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ అర్జీలను పరిశీలించి, సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు బాధితులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ శివకుమార్, మండల సర్వేయరు పర్వీన్ సుల్తానా, వీఆర్వో రవి తదితరులు పాల్గొన్నారు.



ఆటపాక సదస్సులో మాట్లాడుతున్న కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



పులపర్రులో రెవెన్యూ సదస్సు

మెరుగైన వైద్యసేవలందిస్తాం

గుడివాడ టౌన్: ప్రైవేట్ ఫౌండేషన్లు, ట్రస్టుల భాగస్వామ్యంతో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని నిర్వహించి మెరుగైన వైద్యసేవలందిస్తామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం సాయంత్రం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించేందుకు తమ ప్రభుత్వం ప్రైవేట్ భాగస్వామ్యంతో వైద్యసేవలందించాలని నిర్ణయానికి వచ్చిందన్నారు. త్వరలో ఈ విధానాన్ని అమలు చేస్తామన్నారు. నూతన అభివృద్ధి కమిటీ సభ్యులుగా జి. జోన్స్ దయానంద్, మజ్జి శ్రీనివాస్, సీహెచ్ దేవేంద్రుడు, ఎం.కరుణ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పూర్ణవీరయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

ఘనంగా పెన్షనర్స్ డే




గుడివాడ టౌన్: పెన్షనర్స్ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో పెన్షనర్స్ సంఘం గుడివాడ శాఖ అధ్యక్షుడు భవిరి శంకర్‌నాథ్ ఆధ్వర్యంలో తొలుత డీఎస్ నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 75 సంవత్సరాలు పైబడిన 47 మంది విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత డైట్ కళాశాల ప్రిన్సిపాల్స్ జీవీకే ఆంజనేయులు, జి.వెంకటేశ్వరరావు, సంఘం ప్రధాన కార్యదర్శి వి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: పెన్షనర్ల దినోత్సవం తాలూకా సెంటర్ పెన్షనర్ల కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. పెన్షన్ ఉద్యోగి హక్కు అని పెన్షనర్లు అన్నారు. పలు సమస్యలపై విశ్రాంత ఉద్యోగులందరూ చర్చించుకున్నారు. కార్యక్రమంలో బీజీ ప్రభాకరరావు, వీరాస్వామి, బాబూరావు, కోటేశ్వరరావు, కమ్మిలి సుబ్బారావు, నారాయణరాజు, లోయ రంగరావు, జయప్రకాష్, రాజు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



గుడ్లవల్లేరు: చలి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో 85 మంది విద్యార్థినులకు మంగళవారం దుప్పట్ల పంపిణీని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని లయన్స్ డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ ఎన్.వి.వి.ఎస్.వి.ప్రసాద్ ఆర్థిక సాయంతో నిర్వహించారు. లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, లయన్స్ జిల్లా మాజీ చైర్మన్ వై.పి.సి.ప్రసాద్, లయన్స్ ప్రతినిధులు నవాబు, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరం

మండవల్లి: ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరమవుతుందని ఎంఈఓ రామారావు అన్నారు. మండలంలోని లోకుమూడి హైస్కూల్లోని భవిత స్కూల్లో అంగవైకల్యం గల చిన్నారులకు మంగళవారం ఫిజియోథెరపిస్ట్ కె.సునీత ఫిజియోథెరపీ నిర్వహించారు. 10 మంది చిన్నారులకు ఎంఈఓ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ చేసి తగిన సూచనలు సలహాలు అందజేశారు. ఐఈఆర్‌టీలు టి.అరుణకుమారి, పి.వసంత పాల్గొన్నారు.

ఈ- క్రాప్ తప్పనిసరి

మండవల్లి: రబీ పంటలకు ఈ- క్రాప్, ఈకేవైసీ గ్రామ వ్యవసాయ సహాయకులు తప్పనిసరిగా చేయించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కే హబీబ్ అన్నారు. మండవల్లి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో మండవల్లి డివిజన్‌లోని గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హబీబ్ రైతు సేవా కేంద్రం సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. ఏలూరు జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ పి.లలితసుధ పలు అంశాలపై వీఏఏలకు అవగాహన కల్పించారు. స్థానిక సహాయ సంచాలకులు వెంకటమణి, మండవల్లి, ముదినేపల్లి వ్యవసాయాధికార్లు ఎస్‌కే జరీనా, వేణుమాధవ్, మండవల్లి, ముదినేపల్లి వీఏఏలు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కైకలూరు: స్థానిక చిన్న చెరువుగట్టు వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు హాజరయ్యారు.

ముగిసిన వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

గుడ్లవల్లేరు: డోకిపర్రు మహాక్షేత్రం శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థాన వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ ధ్వజ అవరోహణం, పూర్ణాహుతిని మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు నిర్వహించారు. వేంకటేశ్వరుడిని చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. బ్రహ్మోత్సవాల ముగింపునకు సూచనగా వేద పండితులు పూర్ణాహుతిని చేసినట్లు కృష్ణారెడ్డి, సుధారెడ్డి పేర్కొన్నారు. సుధారెడ్డి బాలకృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఏపీలో బాలకృష్ణుని విగ్రహం ఉన్న రెండో దేవాలయంగా డోకిపర్రు పుణ్యక్షేత్రం కావటం విశేషం. కార్యక్రమంలో నిర్వాహకులు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ దంపతులు, పి.ప్రసన్న, పి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రైతుల గుండెల్లో రైళ్లు



మొవ్వ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మారిన వాతావరణం నేపథ్యంలో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. సోమవారం రాత్రి నుంచి వాతావరణంలో మార్పు చోటు చేసుకోవటంతో అధిక ధరలు చెల్లించి మరీ వరికుప్పలు వేయించుకోవడంలో రైతులు నిమగ్నమయ్యారు. మంగళవారం వర్షం పడుతుందన్నట్లు రీతిలో ఉండటంతో రైతులు దూర ప్రాంతాల నుంచి సైతం కూలీలను తీసుకొచ్చి హడావిడిగా కుప్పలు వేయిస్తున్నారు. మండలంలోని మొవ్వ, కూచిపూడి, పెదపూడి, కొండవరం, గూడపాడు తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం జల్లులు పడ్డాయి.

సాగునీటి సంఘాల డీసీ ఛైర్మన్ల ఎన్నిక



కొతవరం డీసీ చైర్మన్ మల్లిపెద్ది, వైస్ చైర్మన్ పరసాను అభినందించిన నాయకులు



మొవ్వలో నియామకపత్రాలు స్వీకరిస్తున్న అధ్యక్ష, కార్యదర్శులు



కృష్ణాపురం డీసీ చైర్మన్ సుబ్రమణ్యం, సంఘాల అధ్యక్షులను సత్కరిస్తున్న నాయకులు

గుడ్లవల్లేరు: కొతవరం ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలో డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్‌గా మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, వైస్ చైర్మన్‌గా పరసా పోతురాజును ఎన్నుకున్నారు. మంగళవారం నూతన డీసీ చైర్మన్, వైస్ చైర్మన్‌కు సాగునీటి సంఘ కార్యవర్గాలతో పాటు ప్రముఖులు పూలమాలలు వేసి అభినందించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్యచౌదరి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు బొప్పన శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోసూరు డీసీ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

మొవ్వ: మండలంలోని కోసూరు-25 డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డీసీ) అధ్యక్షుడిగా భట్లపెనుమర్రు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఎన్నికల అధికారి వాడ్రేవు కామరాజు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ ఎన్నికలకు మండలంలోని భట్లపెనుమర్రు, పెదసనగల్లు, కోసూరు, పెదముత్తేవి, ఘంటసాల మండలంలోని మల్లాయిచిట్టూరు, లంకపల్లి నీటివినియోగదారుల సంఘ అధ్యక్షులు హాజరయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా పి.చలపతిరావు ఎన్నికయ్యారు. తహసీల్దార్ కే మస్తాన్, టీడీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నిడిమోలు డీసీ చైర్మన్‌గా గణేష్

పామర్రు: నిడిమోలు సెక్షన్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ) చైర్మన్‌గా నిమ్మకూరు నీటి సంఘ అధ్యక్షులు వల్లూరిపల్లి గణేష్‌ను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా చల్లపల్లికి చెందిన ఇరిగేషన్ జేఈఈ రబ్బానీ వ్యవహరించారు. అనంతరం గణేష్‌ను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అభినందించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌చంద్ర, సుబ్రమణ్యం, శ్రీహరి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాపురం డీసీ చైర్మన్‌గా సుబ్రమణ్యం

పమిడిముక్కల: కృష్ణాపురం డీసీ చైర్మన్‌గా నాదెళ్ల సుబ్రమణ్యం(పమిడిముక్కల), ఉపాధ్యక్షుడిగా తిరుమలశెట్టి శ్రీనివాసరావు(చోరగుడి)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఎన్నికలో ఎనిమిది నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు సమావేశమై అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులు, నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులను కూటమి నాయకులు సత్కరించారు. ఎన్నికల అధికారులుగా రామ్‌కుమార్, సాయిప్రసాద్ వ్యవహరించారు.

నందివాడలో..

నందివాడ: మండలంలో డీసీ చైర్మన్ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో రుద్రపాక డీసీ చైర్మన్ ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. రుద్రపాక డీసీ చైర్మన్‌గా పాలడుగు నానారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎలక్షన్ ఆఫీసర్ పి.పద్మావతి ప్రకటించారు.

వైస్ చైర్మన్‌గా ఉనికిలి చదలవాడ శ్రీమన్నారాయణ ఎన్నికయ్యారు. వీరిని కూటమి నాయకులు అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు మాజీ మండల ఉపాధ్యక్షుడు పాలడుగు ధర్మపాల్ తదితరులు పాల్గొన్నారు.



నిడమోలు డీసీ చైర్మన్ గణేష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా



నందివాడ మండలంలో ఎన్నికైన వారిని అభినందిస్తున్న నాయకులు

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి మండల పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీలు) ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. ముదినేపల్లి డీసీ చైర్మన్‌గా నారగాని వీరవెంకటనాగేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా పేర్నీడి హనుమార, పెదగొన్నూరు డీసీ చైర్మన్‌గా గుడిసేవ సురేష్, వైస్ చైర్మన్‌గా పోతుమూడి సోమేశ్వరరావు ఎంపికయ్యారు. వీరిని ఎన్డీయే కూటమి నాయకులు సత్కరించి, అభినందనలు తెలిపారు.

మోడల్ టెస్టు పేపర్ల పంపిణీ



పామర్రు: తోట్లవల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ప్రచురించిన మోడల్‌టెస్టు పేపర్లను పదో తరగతి విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు, దాత వేములపల్లి వెంకటేశ్వరరావు పాఠశాల పూర్వపు విద్యార్థి సంఘ అధ్యక్షుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ గన్నె వెంకట్రావు చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడానికి ఈ మోడల్ పేపర్స్ ఎంతగానో ఉపయుక్తం అవుతాయన్నారు. అందరూ మంచి మార్కులతో పాస్ అవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సురేష్‌బాబు, ఉపాధ్యాయులు ప్రభాకర్, రియాజ్‌బాషా, మనోహర్‌కుమార్, పీటర్సన్, వెంకటేశ్వరరాజు, అహ్మద్‌బాబు, నాంచారయ్య, రంగ నాయకులు, పూర్వ విద్యార్థులు జగదీష్, జగజ్జీవన్‌రామ్, శ్రీహరి, రాజమోహన్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com